క్లుప్తంగా

వైభవంగా స్వాతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి

నంద్యాల (వ్యవసాయం): స్థానిక తెలుగు పేటలో వెలిసిన శ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ,పంచామృత అభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించిరం ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీ లక్ష్మీ దేవికి సామూహిక కుంకుమార్చన, మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం స్వామి అమ్మవారికి పల్లకీ సేవ జరిపించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన రాయలు, అర్చకులు రామ్మూర్తి పాల్గొన్నారు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహ కంబ గిరిస్వామి, అభయాంజనేయస్వామి, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

344 కౌలు కార్డులు అందజేత

ఉయ్యాలవాడ: మండలంలో 1195 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 344 మంది కౌలు రైతులకు కార్డులు అందజేసినట్లు తహసీల్దార్ సువర్ణాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులు అన్నదాత సుఖీభవ, పంట నష్ట పరిహారం, పంట దిగుబడులకు మద్దతు ధర వంటి పథకాలు పొందాలంటే కౌలు కార్డులు కలిగి ఉండాలని పేర్కొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక



లహరిని అభినందిస్తున్న చాణిక్యరాజు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు పట్టణంలోని ఎస్పీజీ జూనియర్ కళాశాల విద్యార్థి లహరి ఎంపికై నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణిక్యరాజు తెలిపారు. శనివారం ఎస్పీజీ పాఠశాలలో బంగారు పతకం సాధించిన లహరిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ కాకినాడలో వారం రోజులుగా నిర్వహించిన ప్రత్యేక క్యాంపు నుంచి రాష్ట్ర జట్టు తరఫున లహరి ప్రాతినిథ్యం వహించిందన్నారు. 15వ జాతీయ స్థాయి హాకీ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు జార్ఖండ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ దివాకర్, కోచ్ శ్రావణ్ తదితరులు అభినందించారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



గోవిందపల్లెలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి

శిరివెళ్ల: చిన్నారులకు టీకా తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సుదర్శన్‌బాబు అన్నారు. శనివారం గోవిందపల్లెలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. టీకాలతో ఎన్నో లాభాలున్నాయని తెలిపారు. వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. వేలకు వేలు డబ్బులు పెట్టాల్సిన అవసరం లేదని ప్రతి సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బంది టీకాలు ఉచితంగా వేస్తారన్నారు. బీసీజీ నుంచి అన్ని రాకాల టీకాలు ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జగదీష్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం



శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్

నంద్యాల(అర్బన్): పంచాయితీల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు ముందుకెళ్లాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం పంచాయతీ లెవెల్ యాక్షన్ ప్లాన్‌పై జిల్లాస్థాయి ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సర ప్రణాళికలను పక్కాగా తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న రిసోర్స్ పర్సన్లు ప్రణాళిక తయారీపై అవగాహన కల్పించారు. డీఆర్‌పీ పీడీ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- సమస్యలపై నోరుమెదపని ప్రజాప్రతినిధులు
- సమాచారాన్ని చదివి మమ అనిపించిన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి

దొర్నిపాడు: ప్రజా సమస్యలపై చర్చకు వేదిక కావాల్సిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. శనివారం ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఏదో సరదాగా కాసేపు వచ్చి పోయాం అన్నట్లు గంటన్నరలోపే ముగించి మమ అనిపించారు. గ్రామాల్లోని సమస్యలను లేవనెత్తడానికి పంచాయతీ, గ్రామ సర్పంచ్‌ల ఖాతాలు ఖాళీ అనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు నోరు మెదపలేకపోయారు. ఇక అధికారులు ఐతే తమ వద్దనున్న సమాచారాన్ని మునిపటిలాగే పాఠంలా చదివి వినిపించారు. పశు వైద్యాధికారి చిన్నబాబు పాడిపెంపకం దారులకు శుభవార్త చెప్పారు. ప్రస్తుతం కేవలం పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా ఎద సూదులు వచ్చాయని తెలిపారు. అలాగే పశువైద్యశాలలో నీటి కొరత ఉందని సభ దృష్టికి తీసుకు రాగా నీటి సౌకర్యం కల్పిస్తామని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ తెలిపారు. చివరిగా ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూం.. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, తాగునీటి పైపుల మరమ్మతులు తక్షణం చేపట్టాలని సూచించారు. లీకేజీలు ఉంటే తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సావిత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు శకుంతల, తహసీల్దార్ సుభద్ర, ఎంఈఓ రామచంద్రయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, వెలుగు ఏపీఎం బాబు, హౌసింగ్ ఏఈ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పనుల అడ్డగింపు



విద్యుత్ తీగలను చూపుతున్న గ్రామస్తులు

రుద్రవరం: మండల పరిధిలోని డి.కొట్టాల పంచాయతీ మజారా గ్రామం టి.కొట్టాలలో సర్పంచ్ నరసింహారెడ్డి చేపట్టిన విద్యుత్ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పనులను నిలిపివేశారు. కొంతకాలంగా గ్రామంలో బోరుకు విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో తాగునీటి సమస్య నెలకొంది. సమస్యను కొందరూ గ్రామస్తులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి తీగ అందించాలని విద్యుత్ అధికారులను కోరారు. లేదని చెప్పడంతో పంచాయతీ నిధులను వెచ్చించి తీగను కొనుగోలు చేశారు. శనివారం ఆ తీగను స్తంభం నుంచి బోర్ మోటార్‌కు కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పనులు నిలిపి వేశారు. మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తే తాను విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని సర్పంచ్ తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



సంజీవనగర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు పట్టణంలోని సంజీవనగర్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలోనే విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీల పెంపును తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలపై భారాలు మోపమని ఎన్నికల సమయంలో చెప్పి ఇప్పుడు పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికై నా చార్జీల సర్దుబాటు తగ్గించాలని, సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాసులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): రకరకాల కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆటల పోటీలు నిర్వహించాలని, బోధనేతర పనులు ఉపాధ్యాయులు చేయాలని, వాటి వీడియోలు అప్‌లోడ్ చేయడానికి ఒక అధికారి ఉపాధ్యాయులే నియమించుకోవాలని విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను ఒత్తిడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల తల్లిదండ్రులతో జరిగే సమావేశంలో విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనకు, విద్యాభివృద్ధికి సంబంధించిన విషయాలు చర్చించాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు ఎవరూ కూడా విట్‌నెస్ అధికారిని నియమించవద్దని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయించడం మానుకోవాలని అధికారులు, ప్రభుత్వానికి సూచించారు. పేటీఎంలో విట్‌నెస్ అధికారి ఉత్తర్వులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు జాకీర్‌హుసేన్, రమేష్‌బాబు, మధు, వీరేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చెంచుగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలోని చెంచుగూడెంలో శనివారం జాతీయ డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు తస్లీమా సుల్తాన మాట్లాడుతూ..ం డెంగీకి తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు, చెత్త లేకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు నీటిలో ఆయిల్ వేసి దోమల ఉత్పత్తిని నిరోధించవచ్చని తెలిపారు. తాగునీటి పాత్రలకు మూతలు పెట్టడం వల్ల కూడా దోమలను నివారించవచ్చని సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు జి. వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, ఆశ కార్యకర్తలు పుష్పలత, కామేశ్వరి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీపీటీడీ యూనియన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు, సంఘం నాయకులు నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు కొండా రెడ్డి, కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ.. ఎప్పటినుంచో పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించాలని యూనియన్ సభ్యులు ఎర్ర బ్యాడ్జీ ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిలిచిన ప్రమోషన్లను చేపట్టాలని, పెండింగ్ బకాయిలను ఇవ్వాలని, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, 2020, 2021 సంవత్సరాల అరియర్స్ ఇవ్వాలని,ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ వారే సొంతంగా కొనాలని, డబుల్ డ్యూటీ అమౌంట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.రాయుడు, వెంకటేష్, మస్తాన్ కృష్ణ మద్దిలేటి, బాబు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల రద్దీ సాధారణం

మహానంది: వీకెండ్ సందర్భంగా భక్తులతో కళకళలాడే మహానంది ఆలయ ప్రాంగణాలు శనివారం ఖాళీగా కనిపించాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగిన మహానందీశ్వరస్వామి వారిని కొద్దిపాటి మంది భక్తులు దర్శించుకున్నారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల రైలు మార్గంలోని బొగద సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సుమారు 60 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి నంద్యాల నుంచి నరసరావుపేట వరకు టికెట్ తీసుకున్నాడన్నారు. రాత్రి రైలులో వెళ్లేటప్పుడు కింద పడి మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. మృతి చెందిన వ్యక్తి మూడో తేదీన నరసరావుపేట నుంచి నంద్యాలకు రైలు టికెట్ తీసుకుని వచ్చి మళ్లీ ఇక్కడి నుంచి తిరుగుప్రయాణంలో మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు వివరించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న చర్చి నిర్వాహకులు

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామంలో నిర్మించిన కవనెంట్ చర్చి 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ముత్యాలపాడు బస్టాండు వద్ద చర్చి పాస్టర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ..ం బైబిల్ ప్రవచనాల ప్రకారం అన్నీ దానాల్లో అన్నదానమే గొప్పదని, అందుకే ఏటా చర్చి వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాలు

ఆళ్లగడ్డ: పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో అదే బస్సు కింద పడి మృతి చెందిన చిన్నారి హరిప్రియ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం ఎంఈఓ కార్యాలయం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ రత్న కుమారికి వినతిపత్రం అందజేశారు. చిన్నారి మృతికి శ్రీ కీర్తన స్కూల్ యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఓబులేసు, వెంకట్, షేక్ రియాజ్, నాగార్జున ఉన్నారు.

సహకార సంఘాల సేవలను వినియోగించుకోవాలి




విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి రామాంజనేయులు తెలిపారు. శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని పోలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రైతులకు ఎరువులు, రుణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ సహకార సంవత్సరంపై చాపిరేవుల గ్రామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బ్యాంక్ మేనేజర్ హుసేన్ బాషా, తిరుపాలయ్య, పోలూరు సహకార సంఘం సీఈఓ వీరభద్రుడు, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఆర్‌డీటీ సేవలను కొనసాగించండి

నంద్యాల(న్యూటౌన్):ఆర్‌డీటీ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను పునరుద్ధరించాలని కోరుతూ శనివారం నంద్యాల ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థినులతో ప్రధానమంత్రికి పోస్టుకార్డు ద్వారా విన్నవిస్తు న్నట్లు 15వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సాయిరాంరెడ్డి తెలిపారు. శనివారం కళాశాల లో జరిగిన పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌డీటీ ద్వారా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి 15వ వార్డులో శిథిలావస్థలో ఉన్న మహిళా జూనియర్ కళాశాలను రూ.3 కోట్లతో నిర్మించారన్నారు.

క్షుద్రపూజల కలకలం



మహానంది: గరుడనంది–పోలీస్‌స్టేషన్ సమీపంలోని చింతచెట్టు వద్ద శనివారం క్షుద్రపూజలు కలకలం రేపాయి. చీర, ఇతర వస్త్రాలతో పాటు కుంకుమ కలిపిన ఎర్రటి బియ్యం, ఆకులు, ఉండటంతో ఎవరైనా గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేశారా లేక చేతబడులా అనేది చర్చనీయాంశంగా మారింది.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



కక్షిదారులకు చెక్కు అందజేస్తున్న జడ్జి అమ్మన్నరాజ

నంద్యాల(వ్యవసాయం): లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని మూడవ జిల్లా జడ్జి అమ్మన్నరాజ, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమని, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏసురత్నం పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ లోక అదాలత్ కార్యక్రమంలో నంద్యాల పరిధిలో అత్యధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఎస్టీ కేసులు1281, మోటారు ప్రమాద కేసులు 45, సివిల్ కేసులు9, క్రిమినల్ కేసులు 188, మొత్తం 1,523 కేసులు పరిష్కారమయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రూ.3.70 కోట్లు అందజేశారు.అలాగే 2023లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైద్య విద్యార్థి పర్వేష్‌కు చోళవరం ఇన్సూరెన్స్ కంపెనీ, న్యాయవాదులు విజయ శేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రూ.40 లక్షల చెక్కును జడ్జి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. జడ్జీలు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా లోకదాలత్‌కు వెళ్తే సమయం, డబ్బు అదావుతుందన్నారు. రాజీ కాగల కేసుల పరిష్కారానికి న్యాయవాదులు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. కుటుంబ కలహాలతో భార్యాభర్తలు కోర్టును ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందని, సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సీనియర్ జూనియర్ న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

- లోక్‌అదాలత్‌లో 838 కేసుల పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

ఆళ్లగడ్డ: ఎలాంటి సమస్యలైన రాజీ మార్గం ద్వారా సకాలంలో పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా న్యాయమూర్తి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఇందులో 838 కేసులు పరిష్కారం అయ్యాయి. రూ 61.16 లక్షలు కక్షిదారులకు అందజేశారు. లోక్ అదాలత్‌లో ఏళ్ల తరబడి నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించి ఇరువురికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఇందులో పరిష్కారమైన కేసులపై పైస్థాయిలో కోర్టులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. లోక్ అదాలతే అంతిమ తీర్పు అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి శైలజ ఉన్నారు.

వైద్య పరికరాల అందజేత



పరికరాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ వారు పలు రకాల వైద్య పరికరాలను స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంస్థ ప్రతినిధులు సుమారు రూ.12 లక్షల విలువైన వైద్య పరికరాలను కలెక్టర్ సమక్షంలో ఆసుపత్రి వైద్యాధికారులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వజన ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలను అందజేయడం సంతోషకరమన్నారు. ఇందులో ఒక ఈసీజీ మెషిన్, 2 డెఫ్రిబిలేటర్స్, 1 సక్షన్ అప్పారేటస్, 2 వైన్ ఫైండర్స్ అందజేశారు. ఈ పరికరాల ద్వారా జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగ్గా సేవలు అందజేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. మరిన్ని కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు. అంతకుముందు జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి కలెక్టర్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి, యూనిట్ హెడ్ సాజేంద్ర కుమార్, సీఎస్ఆర్ అడ్మిన్ అంజన్ ప్రకాష్, సీఎస్ఆర్ హెడ్ సురేష్, సీఎస్ఆర్ మేనేజర్ గోపాల్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు





నంద్యాల నీలి వీధిలో ప్రత్యేక అలంకరణలో తల్లి పీరు,ఉయ్యాలవాడలో ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): హిందూ, ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రంను పురస్కరించుకుని శనివారం పట్టణంలో పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నీలి వీధిలో వెలసిన బీ ఫాతిమా, గాంధీచౌక్ హుసేనాలం, జుమ్మామస్జీద్ వద్ద ఇమాం హుసేన్ పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా ముజావర్‌లు పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు పూల దండలు, తమలపాకు దండలు, బాసికాలు, దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అగ్ని గుండం ప్రవేశం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఫాతేహాలు సమర్పించారు. పట్టణంలో రాత్రి గ్రామోత్సవం జరిపించారు.

భక్తిశ్రద్ధలతో ఫాతేహాల సమర్పణ

ఉయ్యాలవాడ : మొహర్రం పండుగను పురస్కరించుకుని శనివారం ఉయ్యాలవాడలో పీర్ల చావిడీల వద్ద కొలువుదీరిన పీర్లకు ఫాతేహాలు సమర్పించారు. మద్య సరిగెత్తు సందర్భంగా దస్తగిరి, మౌలాలి, ఖాసీం స్వామి పీర్లకు చెక్కెర, పులగం, పానకం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా లాల్‌స్వామి సరిగెత్తు



అశేష భక్తుల నడుమ దివిటీల వెలుగులో లాల్‌స్వామి ఊరేగింపు



అగ్ని గుండం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



చాగలమర్రి లాల్‌స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: చాగలమర్రిలోని చిన్న మకానంలో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా శ్రీలాల్‌స్వామి కొలువు 9 రోజుల పాటు భక్తుల ప్రత్యేక పూజలతో కొనసాగుతోంది. మహిమలు కలిగిన స్వామిగా పేరు పొందిన లాల్‌స్వామికి దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన రాత్రి సరిగెత్తు ఊరేగింపు భక్తుల దీపాల వెలుగులతో వైభవంగా సాగింది. ఊరేగింపు ప్రారంభానికి ముందు రెడ్డి సామాజిక వర్గానికి చెంది న కుటుంబ సభ్యులు పానకం, దుత్తలతో స్వామి వద్దకు చేరుకుని ఫాతేహాలు సమర్పించారు. అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. ఊరేగింపు చిన్నమకానం నుంచి ప్రారంభమై అరబ్ మస్జిద్, పోలీస్ స్టేషన్, మేయిన్ బజార్, శ్రీ హురే షహీద్ మకానం, నాయిబ్రాహ్మణ వీధి, గాంధీ సెంటర్, పెద్ద మకానం మీదుగా తిరిగి చిన్న మకానం వరకు ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.భక్తులు తమమొక్కుబడులుగా వెండితో తయారైన గొడుగులు, ఉయ్యాలలు, నిమ్మకాయలు, గుర్రాలు, పూల బాసికాలు సమర్పించారు. కొంతమంది భక్తులు చెక్కర, బెల్లం, లడ్డూలతో తూకం వేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వెంట దీపాలతో ఊరేగింపు ముగిసేవరకు నడిచే భక్తులు విశేష ఆకర్షణగా నిలిచారు. ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి లాల్‌స్వామిని దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్షుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు ము ల్లా ఇబ్రహీం, కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ముత్యాలపాడులో..



పెద్దవంగలిలో అన్నదానం

మొహర్రం పండుగ సందర్భంగా మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని పీర్ల చావిడిలో లాల్‌స్వామిని కొలువుదీర్చారు. అదే విధంగా గ్రామంలోని దూదెకుల ఖాదర్‌గాళ్ల చావిడిలో హజ్రత్ ఇమాం హుసేన్, హజ్రత్ ఇమాం హుసేన్, హజ్రత్ బాదుల్లా స్వాములను కొలువుంచారు. ఆదివారం రాత్రి సరిగెత్తు, సోమవారం పగలు సరిగెత్తు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్ద వంగలి, చిన్న వంగలి గ్రామాల్లో కొలువుదీరిన బాదుల్లా స్వామి, లాల్‌స్వామి పీర్లను శనివారం రాత్రి ఊరేగించారు.